సాక్షి
బాపట్ల
సోమవారం । 13 । అక్టోబర్ । 2025




ఘనంగా గ్యార్మీ పండుగ

అద్దేపల్లి(భట్టిప్రోలు): అద్దేపల్లిలో శనివారం రాత్రి గ్యార్మీ పండుగ నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు (దువా) చేశారు. పుర వీధులలో జెండా ఊరేగింపు చేపట్టారు.



అమ్మవారి దేవస్థానానికి విరాళం

దుగ్గిరాల: కంఠంరాజుకొండూరులోని మహంకాళి అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి తెనాలి వాస్తవ్యులు కొర్ల కృష్ణారావు రూ.లక్ష విరాళం ఆదివారం అందించారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉంది.

కాటేసిన కడలి

విషాదం నింపిన విహారం

- కన్నీటి సంద్రంగా మారిన తీరం
- వేర్వేరు ఘటనల్లో ఐదుగురు గల్లంతు
- ముగ్గురి మృతదేహాలు లభ్యం
- జాడలేని మరో ఇద్దరి మృతదేహాలు



ఒడ్డుకు చేరిన మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

చీరాల: వారంతా వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు. బీటెక్ చదివేందుకు ఒకే కాలేజీలో చేరారు. మంచి స్నేహితులయ్యారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సరదాగా సముద్ర తీరంలో స్నానం చేస్తూ ఆనందంతో కేరింతలు కొడుతూ లోతును అంచనా వేయలేకపోయారు. నిమిషాల వ్యవధిలోనే గల్లంతయ్యారు. స్థానికులు గమనించి నలుగురిని ఒడ్డుకు చేర్చిగా, మిగిలిన ముగ్గురు కడలిలో కలిసిపోయారు. మరో సంఘటనలో సరదాగా సాగరతీరానికి వచ్చిన వారిలో ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. రెండు ఘటనల్లో ఐదుగురు విద్యార్థులు కడలి కెరటాలకు బలి కావడంతో తీవ్ర విషాదం నెలకొంది.

ఎగసిపడిన అలలు

అమరావతిలోని విట్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంటెక్ చదువుతున్న ఏడుగురు స్నేహితులు ఆదివారం సెలవు దినం కావడంతో సరదాగా గడిపేందుకు చీరాల రూరల్ మండలం వాడరేవు సముద్రతీరానికి వచ్చారు. అలల ధాటిని కూడా లెక్కచేయకుండా సముద్రంలో కేరింతలు కొట్టారు. కొద్దిసేపటికి అలలు ఎక్కువగా రావడంతో ఏడుగురు గల్లంతయ్యారు. స్థానిక మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు గమనించి నలుగురు విద్యార్థులను బయటకు తీసుకువచ్చారు. అయితే, వీరిలో సాయి మణిదీప్ (జడ్చర్ల), జీవన్ సాత్విక్ (హైదరాబాద్), శ్రీసాకేత్ (హైదరాబాద్)లు సముద్రంలో గల్లంతయ్యారు. కొంత సమయం తర్వాత ముగ్గురి మృతదేహాలు తీరానికి చేరాయి. అప్పటి వరకు కలిసి ఉన్న స్నేహితులు విగత జీవులుగా మారడంతో స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుల వివరాలను సేకరించారు. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

వాడరేవు సముద్రతీరంలో ఐదుగురు యువకులు మృత్యువాత పడడంతో సమాచారం తెలుసుకున్న ఎస్పీ ఉమామహేశ్వర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చారు. జరిగిన సంఘటనలపై ఆరా తీశారు. అలలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆదివారం జరిగిన సంఘటనలో కూడా మెరైన్ పోలీసులు, స్థానిక గజ ఈతగాళ్లు కొంత మందిని కాపాడారని చెప్పారు. పర్యాటక ప్రాంతంలో ఇటువంటి దురదృష్టకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులు కాలేజీకి సమాచారం అందించారు. వడ్డె సంఘానికి చెందిన ఇద్దరు యువకుల మృతదేహాలు ఒడ్డుకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీరం వెంటే చూస్తూ కన్నీరు కారుస్తున్నారు.

వివాహ వేడుకకు వచ్చి..

వేటపాలెం మండలం వడ్డె సంఘానికి చెందిన మరో ఇద్దరు యువకులు సముద్రంలో గల్లంతయ్యారు. శనివారం వివాహ వేడుక జరిగింది. ఆదివారం సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి కుటుంబంతో వచ్చారు. సముద్రంలో స్నానం చేసేందుకు వెళ్లగా వడ్డె సంఘానికి చెందిన గౌతమ్ (15), షారోన్ (18) గల్లంతయ్యారు. షారోన్ సోదరి వివాహానికి అదే ప్రాంతానికి చెందిన గౌతమ్ మరికొందరు ఆదివారం సముద్రతీరానికి వచ్చారు. అయితే, వీరి మృతదేహాలు ఇంకా తీరానికి రాలేదు. షారోన్ రాజమండ్రిలో బీటెక్ చదువుతుండగా, గౌతమ్ కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. గల్లంతైన వారి మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



మృతుల స్నేహితులతో మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్



మృతుల స్నేహితులతో వివరాలను నమోదు చేస్తున్న పోలీసులు



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ

తురకపాలెంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



గుంటూరు రూరల్: రూరల్ మండలంలోని తురకపాలెంలో ఆకస్మిక మరణాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పందిస్తూ మరణించిన ఒక్కో వ్యక్తి కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన స్థానిక ఎమ్మెల్యే బి. రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ తురకపాలెం తరహాలో అనారోగ్యాలు ప్రబలినప్పుడు కంటికి రెప్పలా ప్రజలను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్ర దానం



రేపల్లె: మండలంలోని నల్లూరుపాలేనికి చెందిన సబ్బినేని సామ్రాజ్యం (65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. మృతి చెందిన తర్వాత తన కళ్లను దానం చేయాలని కుటుంబ సభ్యులను ఆమె కోరారు. దీంతో వారు నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవా సంస్థకు సమాచారం అందించారు. ఆ సంస్థ సమాచారం మేరకు శంకర్ కంటి ఆసుపత్రి సిబ్బంది వచ్చి సామ్రాజ్యం నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా సుదర్శి మానవతా సేవా సంస్థ ప్రతినిధి తలశిల రఘురామ్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇప్పటి వరకు చనిపోయిన 248 మంది నుంచి నేత్రాలను సేకరించి పలువురికి చూపును ప్రసాదించినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

శ్రీశైల గాయత్రి పీఠాధిపతిగా చల్లా రామారావు



వేటపాలెం: శ్రీశైల గాయత్రి పీఠాధిపతిగా చల్లా రామారావు ఎంపికైనట్లు పీఠం ప్రధాన కార్యదర్శి అంబాబత్తుల అండకొండ రాముడు తెలిపారు. రామన్నపేట పంచాయతీ రావూరిపేట శివాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రావూరిపేటకు చెందిన చల్లా రామారావు స్వామి 2026 ఫిబ్రవరి 26వ తేదీన శ్రీశైలంలో పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం ప్రమాణ స్వీకారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి మెగా వెంకటేష్, ట్రస్ట్ సభ్యులు చల్లా లక్ష్మణరావు, తారక బ్రహ్మం, సజ్జా విశ్వనాథ్, వీరరాఘవ, ప్రొఫెసర్ గొరాబత్తిన రవిబాబు, రాహుల్‌జి, బండ్ల బాబు, బట్ట మోహన్‌రావు పాల్గొన్నారు.

ఇన్‌ట్యాక్ రాష్ట్ర కన్వీనర్‌గా ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ



గుంటూరు ఎడ్యుకేషన్: భారత జాతీయ కళా, సాంస్కృతిక వారసత్వ సంస్థ (ఇన్‌ట్యాక్) రాష్ట్ర కన్వీనర్‌గా గుంటూరుకు చెందిన ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌ట్యాక్ జాతీయ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్, చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ అరవింద్ శుక్లా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా అమరావతిలోని పురావస్తు శాఖ మ్యూజియం, అమరలింగేశ్వరస్వామి దేవాలయాన్ని ఇన్‌ట్యాక్ జాతీయ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్‌గా ఉన్న లక్ష్మీనారాయణను రాష్ట్ర కన్వీనర్‌గా నియమించారు. ఇన్‌ట్యాక్ సభ్యులు జాస్తి వీరాంజనేయులు, మేకల రవీంద్రబాబు, అడపా వేణుగోపాల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హైవేపై బోల్తా పడ్డ లారీలు



ప్రత్తిపాడు: హైవేపై రెండు లారీలు బోల్తా కొట్టిన ఘటన ఇది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కోలార్ నుంచి భువనేశ్వర్‌కు కూరగాయల లోడుతో వెళుతున్న లారీ, ప్రత్తిపాడు మండలం నడింపాలెం వద్ద పదహారవ నంబరు జాతీయ రహదారిపై పామాయిల్ ప్యాకెట్ల లోడుతో నెల్లూరు నుంచి అనకాపల్లి వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోతూ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో రెండు లారీలూ బోల్తా పడగా, లారీల్లో ఉన్న కూరగాయలు, పామాయిల్ ప్యాకెట్లు హైవేపై పడిపోయాయి. డ్రైవర్లు, క్లీనర్లకు ఎలాంటి అపాయం జరగలేదు. ప్రత్తిపాడు ఎస్ఐ ఎన్.నరహరి ఘటనా స్థలానికి చేరుకుని, రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాలను ప్రొక్లెయినర్ సాయంతో తొలగించారు.

ఆలయ నిర్మాణానికి రూ.4లక్షలు విరాళాలు



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డు పులుపులవారి వీధిలోని శ్రీ వీరాంజనేయ సహిత శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి రాతి ఆలయ నిర్మాణానికి దాతలు రూ. 4 లక్షలు విరాళంగా అందించారు. పట్టణానికి చెందిన సాతులూరి శివకుమార్, లక్ష్మీ దంపతులు 14వ స్తంభం దాతలుగా రూ.3,01,116లు ఆలయ కమిటీ ప్రతినిధులకు అందచేశారు. అలాగే దొరెడ్ల రామలింగస్వామి, రాజేశ్వరీ దంపతులు రూ.1,00,116లు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వనమా సాంబశివరావు, వనమా కృష్ణ, గజవల్లి మురళీ, బత్తుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పతనం ఖాయం



కోటి సంతకాల కార్యక్రమ వాల్ పోస్టర్‌లను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, పార్టీ నాయకులు

- మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణను విరమించుకోవాలి
- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ గణేష్

రేపల్లె: ప్రజా వ్యతిరేక విధానాలతో కూటమి ప్రభుత్వం పతనం ఖాయమని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధిష్టానం వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం – ప్రజా వైద్యం – ప్రజల హక్కు కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజా ఉద్యమ వాల్‌పోస్టర్‌లను పార్టీ నాయకులు, కార్యకర్తలతో గణేష్ విడుదల చేసి అనంతరం మాట్లాడారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దగ్గర చేసేందుకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కళాశాలలు ఏర్పాటు చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. నేటి కూటమి ప్రభుత్వం కార్పొరేట్ ఆలోచనలు చేస్తూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి వైద్య విద్యను అందని ద్రాక్షపండుగా చేసేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు అధిష్టానం పిలుపు మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉద్యమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొని కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ యార్లగడ్డ మదన్‌మోహన్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొప్పల గోపి, జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, పార్టీ కన్వీనర్లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, దుండి వెంకటరామి రెడ్డి, ఇంకొల్లు రామకృష్ణ, యార్లగడ్డ రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి లుక్కా బాపనయ్య, జిల్లా కార్యదర్శి ఉయ్యూరి శాంతి రాజు, జిల్లా ఆర్గనైజ్ సెక్రటరీ నిజాంపట్నం కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పిట్టు సాంబశివ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకట కృష్ణారెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ నాయకుడు శొంఠి సురేష్ , నాయకులు బొర్రా శ్రీనివాసరావు, కాటూరి శివ నాగబాబు, కట్టుపల్లి సుబ్బారావు, కిరణ్, జోసెఫ్, పీతా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటపాటలూ అవసరమే..

ముగిసిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు



బంగారు పతకాలతో విజేతలు

రేపల్లె: చిన్నారులు విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు ఆటపాటల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని డాక్టర్ ఆకురాతి సుబ్బారావు తెలిపారు. మండలంలోని పేటేరు జడ్పీ హైస్కూలులో ఏపీ పాఠశాల విద్యాశాఖ, రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–14 బాలబాలికల తైక్వాండో పోటీలు ఆదివారం రెండవ రోజు ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రోత్సాహం ఉంటే విద్యార్థులు ఏదైనా సాధిస్తారని, వారిని విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటారని సూచించారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ సెక్రటరీ కొచ్చెర్ల ప్రభాకర రావు మాట్లాడుతూ పోటీల్లో 260 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో బాలికల విభాగంలో 11 మంది బంగారు, 11 మంది రజత, 22 మంది కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు.బాలుర విభాగంలో 11 మంది బంగారు, 11 మంది రజత, 22 మంది కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. బంగారు పతకాలు సాధించిన బాలురు కొహిమాలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బాలికలు నవంబర్‌లో పంజాబ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చెరుకూరి బాబూజీ, దాతలు రావు హరిప్రసాద్, పర్చూరు శ్యామ్‌ప్రసాద్, విద్యాకమిటీ చైర్మన్ జె.రేణుకయ్య, సర్పంచ్ కనపర్తి వసుమతి, ఎంపీటీసీ సభ్యురాలు రావు నెహ్రూా లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరవ చాకిరీపై ఆగ్రహం

గురువుల తిరుగుబాటు

- నేటి నుంచి ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసనలు
- బోధనేతర కార్యక్రమాల బహిష్కరణకు పిలుపు
- ఫ్యాప్టోలో 12 ఉపాధ్యాయ సంఘాలు భాగస్వామ్యం
- గుంటూరు జిల్లాలో ఆరువేల మంది ఉపాధ్యాయులు బోధనలకు దూరం
- బోధన కాలాన్ని హరించి వేస్తున్న యాప్‌లపై వ్యతిరేకత



బోధనేతర విధులను బహిష్కరిస్తూ గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మెమోరాండం అందజేస్తున్న జిల్లా ఫ్యాప్టో చైర్మన్ నరసింహారావు, నాయకులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. తమను బోధనేతర పనుల నుంచి దూరం చేసి, పాఠ్యాంశాల బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర శాఖ పిలుపుతో ప్రభుత్వంపై పోరాటానికి దిగారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో ఫ్యాప్టో చేపట్టిన మహాధర్నాలో వేలాదిగా పాల్గొన్న ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. ప్రభుత్వం అప్పగిస్తున్న అనవసరమైన బోధనేతర పనులతో అసలు తమ వృత్తికి న్యాయం చేయలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.

యాప్‌లతో అవస్థలు

విద్యాశాఖ అమలు చేస్తున్న బోధనేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులను విద్యార్థులకు పాఠాలను చెప్పనీయకుండా చేస్తున్నాయి. విద్యార్థుల హాజరు నమోదు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పనులు, మూల్యాంకన విధులు మినహా అనవసరమైన గూగుల్ షీట్స్ పూర్తి చేయడం, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 వంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను చేపట్టబోమని స్పష్టం చేస్తూ ఫ్యాప్టో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్, డీఈవోలకు మెమోరాండంలు సమర్పించారు. మండల స్థాయిలో ఎంఈవోలకు కూడా ఇచ్చారు. బోధనేతర విధులకు దూరంగా ఉండాలని ఫ్యాప్టో నాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం నుంచి నిరసన చేపట్టనున్నారు. ఫ్యాప్టోలో భాగస్వాములైన 12 ఉపాధ్యాయ సంఘాలు బోధనేతర విధులు, అర్థం లేని యాప్‌లపై ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

విధులను బహిష్కరించడం ఇదే ప్రథమం

మానసికంగా వేధింపులకు గురి చేస్తున్న పాలకులు, అధికారుల తీరుతో విసిగి వేసారిన ఉపాధ్యాయులు బోధనేతర విధులను బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయం కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టులా మారింది. ఉపాధ్యాయులు గతంలో ఎన్నడూ ఇటువంటి నిర్ణయాన్ని తీసుకోలేదు. సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తులు చేయడం, వినతి పత్రాలు సమర్పించడంతో పాటు ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ఉపాధ్యాయ సంఘాలు తొలిసారిగా ప్రభుత్వం అప్పగిస్తున్న విధులను బహిష్కరిచడం ఇదే మొదటిసారి. ప్రభుత్వ తీరుపై గురువుల్లో నెలకొన్న అసహనం, వ్యతిరేకతకు ఇది అద్దం పడుతోంది. గుంటూరు జిల్లాలోని 1,014 ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఆరువేల మంది ఉపాధ్యాయులు శుక్రవారం నుంచి పాఠశాలల్లో బోధనేతర విధులను బహిష్కరించాలని ఫ్యాప్టో ఇచ్చిన పిలుపులో భాగస్వాములయ్యారు. సోమవారం పాఠశాలలు తెరుచుకున్న తరువాత పోరు ఉద్ధృతం కానుంది.

ఉపాధ్యాయులంతా భాగస్వాములు కావాలి

బోధనేతర విధుల బహిష్కరణలో జిల్లాలోని ఉపాధ్యాయులంతా భాగస్వాములు కావాలి. పాఠశాలల్లో బోధన చేయనీయకుండా యాప్‌లు, బోధనేతర పనులతోనే సమయం గడిచిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని పాఠశాలలకు పంపుతుండగా, ఉపాధ్యాయులు విద్యాబోధనకు సమయాన్ని వెచ్చించలేకపోతున్నారు. విద్యాశాఖ చేస్తున్న పనులు పరోక్షంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు దూరం చేసే విధంగా ఉంటున్నాయి. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించి, ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి.

–కె.నరసింహారావు,
గుంటూరు జిల్లా ఫ్యాప్టో చైర్మన్

ఎన్‌ఓసీ క్లియరెన్స్ కాలపరిమితి తగ్గింపునకు ప్రతిపాదనలు



రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్న ఫైర్ సర్వీస్ అధికారులు

గుంటూరు రూరల్: ఒక ప్రాంతంలో కొత్త వ్యాపారాన్ని స్థాపించేందుకు అనుకూల వాతావరణం కల్పించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నామని, వాటిలో ఫైర్ ఎన్‌వోసీ క్లియరెన్స్ కాలపరిమితిని తగ్గించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ పి.వి.రమణ చెప్పారు. నగర శివారులోని గోరంట్ల గ్రామంలోగల నెక్ట్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం జోన్–3 జిల్లాల ఫైర్ డిపార్ట్‌మెంట్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా డీజీ రమణ, సౌత్ జోన్ అడిషనల్ డైరెక్టర్ ఆర్. జ్ఞానసుందరం, రీజనల్ ఫైర్ ఆఫీసర్ జిలానీ పాల్గొన్నారు. రీజనల్ ఫైర్ ఆఫీసర్, గుంటూరు, డీడీఆర్ఎఫ్‌వోలు సమస్యలపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. అన్ని కార్యకలాపాలను వివరంగా చర్చించారు. నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా (ఎన్‌బీసీ) ప్రకారం ఫైర్ సేఫ్టీ నార్మ్స్ సరిదిద్దడానికి అన్ని రకాల నోటీసులు జారీ చేయబడ్డాయని తెలిపారు. మేనేజ్‌మెంట్స్, ఫారమ్స్, స్కూల్స్, కళాశాలలకు నోటీసులు పంపామని, దశల వారీగా తీసుకోవాల్సిన మార్గదర్శకాలు జారీ చేసినట్లు డీజీ తెలిపారు. ప్రొవిజనల్ ఎన్‌వోసీ మూడు రోజుల్లోను, ఆక్యుపెన్సీ ఎన్‌వోసీ 21 రోజులలో జారీ చేయాలని, రెన్యువల్ ఎన్‌వోసీ 21 రోజులలో జారీ చేయాలని చెప్పారు. 15వ ఫైనాన్స్ కమిషన్ వర్క్స్, ఫండ్స్ కేటాయింపుపై చర్చించారు. సమావేశంలో ఆయా జిల్లాల ఫైర్ సర్వీసెస్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

బాపట్ల టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. గడిచిన నెలరోజుల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 1200 మందికిపైగా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. నేరాలకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం కూడా ప్రధానమైన కారణమని, దాని వలన సాధారణ ప్రజలకు, మహిళలకు తీవ్రమైన అసౌకర్యం కలుగుతుందన్నారు. తీరప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

పట్టపగలు చోరీ



సంతమాగులూరు(అద్దంకి రూరల్): తాళం వేసిన ఇంటిలోకి దొంగలు ప్రవేశించి బంగారం వెండి, నగదు దొంగిలించిన ఘటన ఆదివారం మండలంలోని కుందుర్రులో జరిగింది. ఎస్ఐ ఎం.పట్టాభి అందించిన వివరాలు... మండలంలోని కుందుర్రులో ఎస్కే ఖాశింసైదా కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళాలు వేసి పనిమీద బయటకు వెళ్లారు. ఈ సమయంలో గుర్తుతెలియని వారు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంటికి బీరువా తెరిచి రూ.20 వేల నగదు, సవర బంగారం, 35 తులాల వెండి వస్తువులు అపహరించారు. ఇంటికి వచ్చిన ఖాశింసైదా దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేశారు.

రేపు దమ్మ దీక్షా దిన వేడుకలు



రేపల్లె: బాపట్ల జిల్లా భట్టిప్రోలు బౌద్ధ క్షేత్రం వద్ద ఈ నెల 14వ తేదీన దమ్మ దీక్షా దిన వేడుకలు నిర్వహించనున్నట్లు ది ఆది ఆంధ్ర నవ బుద్ధిస్ట్ సొసైటీ కార్యదర్శి దోవా రమేష్ రాంజీ తెలిపారు. పట్టణంలోని నవ బుద్ధిస్ట్ సొసైటీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించార. 1956 అక్టోబర్ 14న నాగపూర్ వేదికగా లక్షలాది మంది దళితులు అంబేడ్కర్ సారథ్యంలో బౌద్ధాన్ని స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని భారతదేశంలోనే అతి పురాతనమైన భట్టిప్రోలు బౌద్ధస్థూపం వద్ద 70వ దమ్మ దీక్షా దిన వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేడుకలకు బౌద్ధ రచయితలు బొర్రా గోవర్ధన్, కంచర్ల శేషు కుమార్, బొనిగల రామారావు, తంగిరాల సోనీలతో పాటు పూలే, అంబేడ్కర్ సంఘాల ప్రతినిధులు అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. వేడుకల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సొసైటీ కోశాధికారి కర్రా బాబూరావు, సభ్యులు నెరుసు వెంకటరావు నాయుడు, తురిమెళ్ల శ్యామ్ పాల్గొన్నారు.

19న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ఈనెల 19వ తేదీన జిల్లా సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ పి.సామంతిరెడ్డి, ప్రెసిడెంట్ వంశీ కృష్ణారెడ్డి, కోశాధికారి ఆవుల జనార్దనరావు యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాఫ్ట్‌బాల్ పురుషుల విభాగానికి సంబంధించి ఈ పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు కూడా స్కాలర్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోనే నిర్వహిస్తామని తెలిపారు. సెలక్షన్ ట్రయల్స్‌కు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తప్పనిసరిగా తీసుకొని రావాలన్నారు. వివరాలకు 9885335457, 9666723772 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

సెపక్‌తక్రా విజేత కృష్ణ

- ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రకాశం, తూర్పు గోదావరి
- క్రీడాకారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేత



మెమెంటోలు, సర్టిఫికెట్లు అందుకుంటున్న క్రీడాకారులు

చీరాల రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా జూనియర్ బాల, బాలికల పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. స్థానిక మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో శనివారం ప్రారంభమైన పోటీలకు రాష్ట్రంలోని 17 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కృష్ణా జిల్లాకు చెందిన బాల, బాలికల జట్లు అన్ని విభాగాల్లో రాణించి విజేతలుగా నిలిచి ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. తృతీయ స్థానాన్ని తూర్పు గోదావరి జిల్లా జట్టు గెలుచుకుంది. అలానే బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టు బాలుర విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా ద్వితీయ స్థానాన్ని ప్రకాశం జిల్లా జట్టు గెలుపొందింది. తృతీయ స్థానంలో అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. ఈ పోటీలు ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య ఆసక్తికరంగా.. ఉత్కంఠ భరితంగా జరిగాయి. బరువైన బాలును ఒక్క కాలితో గాలితో ఎగిరి కొట్టి అవతలి కోర్టులోని పంపాల్సి ఉంది. అయినప్పటికీ క్రీడాకారులు ఎంతో పట్టుదలతో గెలుపుకోసం ఆటపై పట్టు సాధిస్తూ ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఆటను తిలకించేందుకు ప్రేక్షకులు భారీ సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు. విజేతలుగా నిలిచిన క్రీడా జట్లకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సెపక్‌తక్రా జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఇస్తర్ల బాబూరావు, ఏపీ బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి, నరసరావుపేట ఎంఎం కాలేజెస్ చైర్మన్ ఎంఆర్ రామశేషగిరిరావు, సెపక్‌తక్రా జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఇస్తర్ల సుభాషిణి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బాపట్ల జిల్లా సెపక్‌తక్రా జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్ర, జిల్లా అథ్లెటిక్ ట్రాక్, ఫీల్డ్ కోచ్ వి.వనజ, గజవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫార్మసీ ప్రవేశాలకు కొత్త షెడ్యూల్



ఫార్మసీ విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీసెట్-2025లో అర్హత సాధించి, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థుల కోసం రాష్ట్ర ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యాశాఖ సంయుక్తంగా సవరించిన షెడ్యూల్ విడుదల చేశాయి. ఉమ్మడి గుంటూరుజిల్లాలో 43 ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు ఈనెల 14 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది.

దరఖాస్తు సమయంలోనే పూర్తయిన సర్టిఫికెట్ల పరిశీలన..

ఏపీ ఈఏపీ సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. దరఖాస్తు సమయంలోనే విద్యార్థులు సమర్పించిన టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, సామాజికవర్గ, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఆన్‌లైన్‌లో పూర్తి చేశారు. ధ్రువపత్రాల పరిశీలన అసంపూర్తిగా ఉన్న విద్యార్థులు వాటిని కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపించే సూచనల ఆధారంగా తిరిగి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

25 నుంచి తుది విడత కౌన్సెలింగ్

బైపీసీ స్ట్రీమ్ మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ ముగిసిన వెంటనే కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీ కోసం ఈనెల 25 నుంచి తుది విడత ప్రవేశాల ప్రక్రియ చేపట్టనున్నారు. ఏపీ ఈఏపీసెట్ బైపీసీ స్ట్రీమ్ నోటిఫికేషన్‌లోనే రెండు విడతలకు సంబంధించిన షెడ్యూల్ వివరాలను పొందుపర్చారు.

బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రం సేవలు శ్లాఘనీయం

- ఐదు రాష్ట్రాల్నుంచి 750 కుటుంబాలు హాజరుకావటం విశేషం!
- 15వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికలో రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు కామేశ్వర ప్రసాద్



వివాహ వేదిక సమాచార పుస్తక ఆవిష్కరణ

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలిలో నిర్వహిస్తున్న బ్రాహ్మణ ఉచిత వివాహ సమాచార కేంద్రం సేవలు శ్లాఘనీయమని రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు కామేశ్వర ప్రసాద్ అన్నారు. స్థానిక నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ కళాసదనంలో ఆదివారం 15వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిచయవేదిక జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన సమావేశానికి సంఘ అధ్యక్షుడు దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. ఐదు రాష్ట్రాల్నుంచి 750 కుటుంబాలవారు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి కామేశ్వరప్రసాద్ వివాహవేదిక సమాచార పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. శాఖ భేదాన్ని చూడకుండా వివాహాలు జరుపుకోవాలని హితవు పలికారు. రాష్ట్రస్థాయిలో 15 పర్యాయాలు పరిచయ వేదికను తెనాలిలో నిర్వహించటం గొప్పగా ఉందన్నారు. సంఘ అధ్యక్షుడు దక్షిణామూర్తి మాట్లాడుతూ వైష్ణవి కేటరర్స్ హైదరాబాద్, బ్రాహ్మణ పరిషత్, వివిధ బ్రాహ్మణ సంఘాలు, అర్చక సంఘాల సహకారంతో నిర్వహించినట్టు తెలిపారు. తెనాలిలో ప్రతి ఆదివారం ఉచిత సమాచార సేవలను అందిస్తున్నట్టు గౌరవ అధ్యక్షుడు ప్రకాష్‌రావు చెప్పారు. సమాచార వేదికను ఏర్పాటుచేసిన సూర్యప్రకాశరావు, సుబ్బారావు సత్యబాబు, రామ్మోహనరావు ఆశయానికి అనుగుణంగా సేవలు అందిస్తున్నట్టు కోశాధికారి రాజేంద్రప్రసాద్ చెప్పారు. వివిధ విభాగాల ద్వారా బ్రాహ్మణులకు, బ్రాహ్మణ సంఘాలకు సేవలు అందిస్తున్న ప్రముఖులను సత్కరించారు. ఏపీపీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేదం హరిప్రసాద్, నెల్లూరు హైదరాబాదు ప్రాంతాల ప్రతినిధులు ఉమాదేవి, జయలక్ష్మి, విశ్వనాథం, మనవ రాము, కందాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సత్యకుమార్, ఉపాధ్యక్షుడు ఆమంచి రాంబాబు, సంయుక్త కార్యదర్శి వేణుధర్, బీఎల్ సత్యనారాయణమూర్తి, పూర్ణ భాస్కర్, శ్రీనివాస్, కోదండ రామమూర్తి, వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు సాయి, శ్రీనివాసమూర్తి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలు గడువు పెంపు

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియేట్ (దూరవిద్య) కోర్సులలో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కె.ఎం.ఏ.హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.నరసింహారావు ఉత్తర్వులు జారీ చేసినట్టు స్పష్టం చేశారు. అపరాధ రుసుం రూ.200 చెల్లించి ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటి వద్ద ఉంటూనే దూర విద్య విధానంలో 10వ తరగతి, ఇంటర్మీడియేట్ పూర్తిచేసే అవకాశం ఉందని వివరించారు. ప్రవేశాలు పొందిన అభ్యాసకులు సెలవు రోజుల్లో నిర్వహించే క్లాసులు, ప్రాక్టికల్స్‌కు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. అభ్యాసకుల అడ్రస్‌కు నేరుగా పుస్తకాలు పంపుతారని పేర్కొన్నారు. రెగ్యులర్ కోర్సు ద్వారా పొందే సర్టిఫికెట్లకు ఎంత విలువ ఉంటుందో ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లకు అంతే విలువ ఉంటుందన్నారు. సదరు సర్టిఫికెట్లతో ఉన్నత చదువులు, ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలోని ఏఐ సెంటర్లలో సంప్రదించాలని సూచించారు.

టూత్ పేస్ట్‌గా భావించి ఎలుకల నివారణ పేస్ట్ వినియోగం

అస్వస్థతకు గురై వృద్ధురాలు మృతి

నాదెండ్ల: టూత్ పేస్ట్‌గా భావించి ఎలుకల నివారణ పేస్ట్‌ను వినియోగించి వృద్ధురాలు మృత్యువాత పడిన సంఘటన సాతులూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ జి పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. జెట్టిపాటి పోలేరమ్మ (69) ఈనెల 8న ఉదయం పళ్లు తోముకునేందుకు టూత్ పేస్ట్ అనుకుని ఎలుకల నివారణ పేస్ట్‌ను వినియోగించింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురికావటంతో కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త, కుమార్తె గతంలో మృతి చెందగా, ప్రస్తుతం ఈమె మనవళ్ల సంరక్షణలో ఉంటుంది. వృద్ధురాలి మనుమడు మల్లికార్జునరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు!

పట్నంబజారు: కొద్ది రోజుల క్రితం పొన్నూరు రోడ్డులో జరిగిన కుర్రా నాగ గణేష్ (25) హత్య పాఠక విదితమే. తెనాలికి చెందిన గణేష్ గుంటూరు సంగడిగుంటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో తన బంధువుల అమ్మాయి అని అంజనాదేవిని గత నెల 25వ తేదీన ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అంజనాదేవి సోదరుడు కీర్తి దుర్గారావు తన స్నేహితులతో కలిసి హత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో గత రెండు రోజుల క్రితమే ప్రధాన నిందితుడు దుర్గారావు కోర్టులో లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరు మాత్రమే ఉన్నారని తొలుత భావించిన పోలీసులు, హత్య సమయంలో నలుగురు ఉన్నట్లు గుర్తించారు. హత్య ఘటనలో కీలకంగా వ్యవహరించిన నలుగురితో పాటు వీరికి కత్తులు అందజేసిన వ్యక్తులు, ఘటన జరిగిన తరువాత నిందితులకు ఆశ్రయం ఇచ్చిన వ్యక్తులను పూర్తిస్థాయిలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సుమారుగా ఎనిమిది మంది నిందితులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. నేడో.. రేపో వారిని అరెస్ట్ చూపే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. నిందితులను పట్టుకోవటం కోసం ప్రత్యేక టీంలుగా ఏర్పడి.. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. హత్య జరిగిన తరువాత గంటల వ్యవధిలో నిందితుడి కుటుంబ సభ్యులు అందరూ ఫోన్‌లు స్విచ్చాఫ్ చేసి వెళ్లిపోయినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ నుంచి సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టి ముందుకు సాగారని తెలుస్తోంది. కోర్టులో లొంగిపోయిన ప్రధాన నిందితుడు దుర్గారావును కూడా విచారణ నిమిత్తం కస్టడీకి తీసుకునేందుకు పోలీసులు దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. హత్యకు సంబంధించి కేవలం దుర్గారావు ప్రమేయం మాత్రమే ఉందా.. లేక అంజనాదేవి కుటుంబసభ్యుల పాత్ర కూడా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే దుర్గారావుపై పోక్సో కేసుతో పాటు, పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఏపీ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



జమ్ముల రాధాకృష్ణను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు, ప్రింటర్లు

నరసరావుపేట: ఏపీ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం వినుకొండరోడ్డులోని రోటరీక్లబ్ భవనంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జమ్ముల రాధాకృష్ణ ఏపీ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్‌కు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకొని అభినందనసభ, జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా కేవీ, కార్యదర్శిగా కసుకుర్తి రాజశేఖర్, కోశాధికారిగా రాంబాబు, చిలకలూరిపేట, సత్తెనపల్లి, మాచర్ల, పిడుగురాళ్లకు చెందిన జిల్లా సభ్యులతో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నరసరావుపేట ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మన్నేపల్లి శ్రీనివాసరావు, పడవల వంశీకృష్ణ, కోశాధికారి చిన్ని వెంకటేష్‌ల ఆధ్వర్యంలో జమ్ముల రాధాకృష్ణను సన్మానించారు. ప్రింటింగ్ రంగంలో రాబోతున్న మార్పులు, అడ్వాన్స్ మిషనర్, క్లస్టర్స్, ఇతర విషయాలపై చర్చించారు. కార్యక్రమానికి హాజరైన వారందరికి ధన్యవాదాలు తెలియచేశారు.

జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం



మనోజ్ బిస్తా (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్

మంగళగిరి టౌన్: మంగళగిరిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నేపాల్ దేశానికి చెందిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు గుంటూరు జిల్లా పెదకాకాని సమీపంలో వున్న ఓ బార్‌లో సుమారు సంవత్సరం నుంచి నేపాల్‌కు చెందిన మనోజ్ బిస్తా (26), రాకేష్ (34) పనిచేస్తున్నారు. భ్రమరాంబపురం కాలనీలో ఓ రూమ్ తీసుకుని ఇద్దరూ అద్దెకు ఉంటూ ప్రతిరోజూ విధులకు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి 12 గంటలకు విధులను ముగించుకుని యజమాని దగ్గర నుంచి స్కూటీ తీసుకుని వెళ్లారు. తిరిగి వెళ్లే క్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4.30 సమయంలో జాతీయ రహదారిపై విజయవాడ వైపు వెళుతుండగా మంగళగిరి వద్ద వెనుక నుంచి ఓ వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు రోడ్డుమధ్యలో పడిపోయారు. ఆదేసమయంలో వెనుక నుంచి ఓ బస్సు వారిపై నుంచి వెళ్లడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమీపంలో వున్న ఓ వ్యక్తి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న మంగళగిరి పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్ మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించి మృతుల వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల్లో మనోజ్ బిస్తా (26) యువకుడికి తల్లిదండ్రులు లేరని, 10 సంవత్సరాల నుంచి గుంటూరు నగరంలో వివిధ బార్లలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. నేపాల్‌లోని సొరన ప్రస్తకీర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకుల్లో రాకేష్ (34)కు తండ్రి లేడని, అమ్మ, చెల్లి మాత్రమే ఉన్నారని, ఇతను గత సంవత్సర కాలం నుంచి బార్‌లో పనిచేస్తున్నాడని ఇద్దరూ రూమ్‌లో అద్దెకు ఉంటూ పెదకాకాని గోల్డెన్ బార్‌లో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాకేష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని పేర్కొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు



పెదకాకాని: కోడిపందేల స్థావరంపై దాడులు జరిపి ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెనిగండ్ల శివారులో ఆదివారం కోడి పందేలు వేసేందుకు సుమారు 50 మంది పందెంరాయుళ్లు కోళ్లతో అక్కడికి చేరుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.9,300, 17 బైక్‌లు, 8 సెల్‌ఫోన్‌లు, కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు. గత కొంతకాలంగా వెనిగండ్ల శివారులోని నిర్మానుష్య ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా సాగుతున్నాయి. కోళ్లకు కత్తులు కట్టే వారు ఈ పందేల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు.

సుపరిపాలనకు స.హ. చట్టం ఆయుధం



మాట్లాడుతున్న శామ్యూల్ జోనాథాన్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం సమాచార హక్కు చట్టం ఒక ఆయుధం వంటిదని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జోనాథాన్ పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో ఫోరమ్ ఫర్ ఆర్టీఐ ఆధ్వర్యంలో సమాచార హక్కుచట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైతన్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శామ్యూల్ జోనాథన్ మాట్లాడుతూ సమాచారం పొందడం ప్రజల ప్రాథమిక హక్కు అని, ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చునని తెలిపారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పేరుకే పరిమితమైందని, సక్రమంగా అమలు కావడం లేదన్నారు. చట్టాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, ఫోరం ఫర్ ఆర్టీఐ అధ్యక్షుడు ఈమని హనుమంతరావు, కార్యదర్శి విజయకుమార్, డాక్టర్ ఎం.సుధ, కె.జయసుధ, విల్సన్ పాల్గొన్నారు.

నంబూరు పాతకాల్వలో ఈతకు దిగి వ్యక్తి మృతి



పెదకాకాని: హైలెవల్ చానల్(పాతకాలువ)లో ఈతకు దిగి నీటమునిగిన వ్యక్తి మృతి చెందిన సంఘటన నంబూరులో చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలానికి చెందిన శ్రీనివాసరావు దుగ్గిరాల మండలంలోని కంఠంరాజు కొండూరు మహంకాళి అమ్మవారి ఆలయానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరిన క్రమంలో మార్గమధ్యంలో నంబూరు శివారులోని హైలెవల్ చానల్‌వద్ద ఈతకు దిగాడు. కాలువ పరిమాణం ఎక్కువగా ఉండటంతో పాటు ఆ ప్రాంతంలో నిమజ్జనం చేసిన విగ్రహాలు ఉండటంతో వాటిలో ఇరుక్కుని నీట మునిగి మృతి చెందాడు. సంఘటనా స్థలానికి సమీపంలో ఈతలు వేస్తున్న వారితో పాటు పలువురు గ్రామ ప్రజలు అక్కడికి చేరుకుని శ్రీనివాసరావు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

15న విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

లక్ష్మీపురం: విద్యుత్ కార్మిక వర్గ శ్రేయస్సు కోసం, సంస్థ పరిరక్షణకై కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, స్ట్రగుల్ కమిటీ డిస్కం నాయకులు డి.వెంకటేశ్వరరావు, ఎల్.రాజులు ఆదివారం తెలిపారు. విద్యుత్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. దీనిలో భాగంగానే ఈనెల 15న విద్యుత్ కాంట్రాక్ట్, జేఎల్ఎం, గ్రేడ్ 2 ఉద్యోగులు నిరవధిక సమ్మె చేయనున్నారని, దాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహారాష్ట్రలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు.